సాక్షి
వికారాబాద్

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



సంఘం అభివృద్ధికి కృషి

వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



పోషకాహారంతో ఆరోగ్యం

మహిళలు, కిషోర బాలికలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ కాంతారావు అన్నారు. 8లో▸



ఉరికితే దొరకవు..

ఆర్టీసీ బస్సులకు అసలే సమయపాలన ఉండదు. ఆపై కాలం చెల్లిన సర్వీసులు. ఉరికితే దొరకవు. 9లో▸

‘ఆమె’కు అందలం

మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తే కొడంగల్, తాండూరుపై ప్రభావం

- ఇక్కడ పురుష ఓటర్లకంటే మహిళా ఓటర్లే అధికం
- రెండు స్థానాలూ వారికే రిజర్వ్ అయ్యే అవకాశం?
- ఇదేజరిగితే జిల్లాలో మారనున్న రాజకీయ సమీకరణాలు



కొడంగల్‌లో..
మొత్తం ఓటర్లు : 2,19,581
మహిళలు : 1,10, 239
పురుషులు : 1,09,163,
ట్రాన్స్‌జెండర్ : 15
సర్వీస్ ఓటర్లు : 164

తాండూరులో..
మొత్తం ఓటర్లు : 2, 22,177
మహిళలు : 1,13,407
పురుషులు : 1,08,712
ట్రాన్స్‌జెండర్ :49
సర్వీస్ ఓటర్లు : 22

కొడంగల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళా బిల్లుకు ఆమోదం లభించడంతో పాటు రిజర్వేషన్లు అమల్లోకి వస్తే తెలంగాణ రాష్ట్రంతో పాటు వికారాబాద్ జిల్లాలోని రెండు నియోజకవర్గాలపై ఆ ప్రభావం తప్పక ఉంటుంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. బిల్లు ఆమోదం పొంది రిజర్వేషన్లు అమలు చేయాల్సి వస్తే తెలంగాణ వ్యాప్తంగా 39 స్థానాలు మహిళలకు కేటాయించాల్సి ఉండగా.. అందులో కొడంగల్, తాండూరు నియోజకవర్గాలను తప్పక మహిళలకు రిజర్వ్ చేసే అవకాశం ఎక్కువగా ఉంది.

పెద్ద నియోజకవర్గంగా కొడంగల్

జిల్లాలో.. కొడంగల్‌కు రాజకీయపరంగా ఎంతో ప్రాధాన్యత ఉంది. కొడంగల్ నియోజకవర్గం ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన స్థానం. ఆయన ఇక్కడినుంచి మూడుసార్లు పోటీచేసి రెండుసార్లు గెలిచారు. ప్రస్తుతం మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేయనున్నారు. ఆయనకు నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ఉంది. నమ్మకంగా పనిచేసే నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కొడంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పట్నం నరేందర్‌రెడ్డి పోటీలో ఉండనున్నారు. 2018లో ఆయన కొడంగల్ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటినుంచి నియోజకవర్గంలో మంచి పట్టు సాధించారు. బీఆర్ఎస్ పార్టీకి కూడా గ్రామాల్లో కార్యకర్తలు, నాయకుల బలం బాగానే ఉంది. జిల్లాలో కొడంగల్ పెద్ద నియోజకవర్గంగా ఉంది. కొడంగల్, కోస్గి, మద్దూరు, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల, కొత్తపల్లి, గుండుమాల్ మండలాలతో బాహుబలి నియోజకవర్గంగా పేరుగాంచింది. నియోజకవర్గం ఏర్పడి 70 సంవత్సరాలు దాటింది. 1952 నుంచి 2018 వరకు కొడంగల్ అసెంబ్లీ స్థానానికి 15 సార్లు ఎన్నికలు జరగగా.. కాంగ్రెస్ పార్టీ 6 సార్లు, తెలుగుదేశం పార్టీ 5 సార్లు, స్వతంత్ర అభ్యర్థులు 3సార్లు, బీఆర్ఎస్ పార్టీ ఒకసారి విజయం సాధించింది.

తాండూరులో ఇప్పటికే రాజకీయ అనిశ్చితి..

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తాండూరును తన రాజకీయ స్థావరంగా చేసుకొని తిరుగులేని నేతగా ఉన్నారు. అయితే ప్రస్తుతం తాండూరులో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఒకే పార్టీలో ఉన్న మంత్రి మహేందర్‌రెడ్డి.. ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి రాజకీయ ఉనికి కోసం పోరాటం చేస్తున్నారు. తాజాగా మహేందర్‌రెడ్డితో విభేదాలకు స్వస్తిపలికామని.. కలిసికట్టుగా పనిచేస్తామని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి తెలిపారు.ఇలాంటి పరిస్థితిలో తాండూరును మహిళలకు కేటాయిస్తే భవిష్యత్‌లో మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి, ప్రస్తుత వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న సునీతా మహేందర్‌రెడ్డికి బాటలు వేసినట్లే అవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆమెకు టికెట్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆమె అభిమానులు అంటున్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: తాండూరులోని జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో 6 నెలల కాలవ్యవధికి గాను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో స్టాఫ్‌నర్స్ 34, ఫార్మసిస్టు 3, రేడియోగ్రాఫర్ 2, థియేటర్ అసిస్టెంట్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 21 నుంచి 25వ తేదీ సాయంత్రం ఐదుగంటల లోపు దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

హ్యాట్రిక్ కొట్టబోతున్నాం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేదని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మూడోసారి అధికారం చేపడుతుందని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఆత్మీయ పలకరింపులో భాగంగా బుధవారం యాలాల మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంత్రి మహేందర్‌రెడ్డి, తాను కలిసికట్టుగా బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. పార్టీ క్యాడర్ కూడా ఎలాంటి గందరగోళానికి గురికాకుండా అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, వైస్ ఎంపీపీ రమేష్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు కరణం పురుషోత్తంరావు, శ్రీనివాస్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్: డీఎస్పీ



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

పరిగి: నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తామని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో బుధవారం 60 మంది పోలీసు సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించగా.. పేపర్లు సరిగా లేని 37 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను గుర్తించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కొంతమంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి కూలీపనుల కోసమని వచ్చి గ్రామాల్లో తిష్టవేసి చోరీలు, నేరాలు, హత్యలకు పాల్పడుతున్నారని.. అలాంటివారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే 100 కు డయల్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి కాల్స్ వచ్చినా, సందేశాలు పంపినా ఎవ్వరూ స్పందించరాదని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. సీఐ వెంకట రామయ్య, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు అంత్యక్రియలు



కుక్కకు అంత్యక్రియలు చేపట్టిన యజమాని అశోక్

పెద్దేముల్: పెద్దేముల్ గ్రామానికి చెందిన మాజీ సైనికుడు విద్యాసాగర్, తాండూరు పట్టణానికి చెందిన హెఎం టీవీ జర్నలిస్ట్ అశోక్‌కుమార్ కొంతకాలం నుంచి పెద్దేముల్‌లోని వారి నివాసంలో లాబ్రడా అనే రకం పెంపుడు కుక్క(టాఫీ)ను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ఈ పెంపుడు కుక్క ఇంట్లో ఓ సభ్యుడిగా ఉండేది. సోమవారం అర్ధరాత్రి బహిర్భూమికి వెళ్లిన టాఫీని వీధి కుక్కలు కాటేశాయి. గమనించిన యజమానులు టాఫీకి వైద్య చికిత్సలు చేయించారు.అయితే చికిత్స పొందుతూ టాఫీ బుధవారం ఉదయం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, స్థానికులు కుక్క(టాఫీ)కి సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి పెద్దమనసు చాటుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

‘ఆయిల్‌పామ్’ను ప్రోత్సహించండి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- వివిధ శాఖల అధికారులు, ప్రైవేట్ ఫుడ్ కంపెనీ యజమానులతో సమీక్ష

వికారాబాద్ అర్బన్: జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనువైన వాతావరణం ఉందని.. రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. ఆయిల్ పామ్ సాగుపై ఉద్యానవన పట్టు పరిశ్రమల శాఖ, హెల్తీ హార్ట్‌ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన 3వేల ఎకరాల ఆయిల్‌పామ్ సాగును 6వేల ఎకరాలకు పెంచేలా కృషిచేయాలన్నారు. ఈ పంటకు సంబంధించి సాగు విషయంలో ప్రభుత్వ సహకారం ఉంటుందని.. పండిన పంటను ఆయిల్‌పామ్ కంపెనీలు తప్పనిసరిగా కొనే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పంట సాగుకు జాతీయ ఉపాధి హామీ పథకం అనుసందానంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ అధికారి చక్రపాణి, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, హెల్తీ హార్ట్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ భరత్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు మల్లికార్జున్, స్వరూప, వినోద్, శంకర్, రుద్రమూర్తి, లక్ష్మీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం పోలింగ్‌కు సహకరించండి

- ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదయ్యేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు కోరారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 5న కొత్త ఓటరు జబితా విడుదల చేస్తామని చెప్పారు. ఏమైనా అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో యువత, వృద్ధులు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, డీఏఓ నసీరుద్దీన్, డీటీ విజయేందర్, ఆర్ఐ రాజిరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేలను తిరగనివ్వం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

- కలెక్టరేట్ ముట్టడికి అంగన్‌వాడీల యత్నం
- పోలీసులు అడ్డుకోవడంతో ప్రధాన గేటు ఎదుట నిరసన

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతకొద్దిరోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది బుధవారం కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. జిల్లా నలుమూలల నుంచి వారు వికారాబాద్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌లో వెళ్లేందుకు యత్నించిన అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ప్రధాన గేటు ఎదుట బైఠాయించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నర్సమ్మ, భారతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, కార్యదర్శి రామకృష్ణ, మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26,000 అందజేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.20 లక్షలు కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సీఎం కేసీఆర్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలుచేయా లన్నా రు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, చంద్ర య్య, అంగన్‌వాడీ జిల్లా నాయకులు వసంత, రేణు క, సుజాత, చంద్రకళ, ప్రమీల, కళావతి, పుష్ప, భారతి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, సంగీత, అంగన్‌వడీ టీచర్లు, సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉత్సవాలకు భారీ బందోబస్తు

- జిల్లాలో 2,708 వినాయక మండపాలు
- శోభాయాత్ర ఫిర్యాదులకు స్పెషల్ కంట్రోల్ రూమ్
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలో ఎస్పీ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

తాండూరు: వినాయక ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి కోరారు. తాండూరు పట్టణంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న జరిగే వినాయక నిమజ్జనం శోభాయాత్రకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ శేకర్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో మొత్తం 2,708 వినాయక మండపాలు ఉన్నాయన్నారు. వాటిలో తాండూరు సబ్ డివిజన్ పరిధిలో 803 మండపాలు, పరిగి సబ్ డివిజన్‌లో 1,061, వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలో 844 మండపాలు ఉన్నాయన్నారు. అయితే గణేశ్ నిమజ్జనం.. మొదట తాండూరు పట్టణంలో 5 రోజులకు పెద్దఎత్తున జరుగుతుందన్నారు. నిమజ్జన ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం తలెత్తకుండా పోలీసు శాఖ భద్రతా చర్యలు చేపట్టిందన్నారు. శోభాయాత్ర రోజు పోలీసు శాఖ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిందన్నారు. తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనానికి కోకట్ కాగ్నా నదిలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిమజ్జనం రోజున పోలీసు శాఖతో పాటు మున్సిపల్, రెవెన్యూ, వైద్యశాఖ, విద్యుత్, ఆర్అండ్‌బీ అధికారులు విధుల్లో ఉంటారన్నారు. శోభాయాత్ర డ్యూటీలో జరిగేందుకు అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు సిబ్బంది ఉంటారన్నారు. ఊరేగింపులో డీజే సౌండ్‌లకు అనుమతులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కమల్‌అతార్, ఖుర్షీద్, తాండూరు జెడ్పీటీసీ మంజుల, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిద్దాం



సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా నేతలు

- తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు బహుమతిగా ఇద్దాం
- కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ

ఇబ్రహీంపట్నం: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియమ్మకు బహుమతిగా ఇద్దామని ఆ పార్టీ మహిళా నేతలు, ప్రజాప్రతినిధులు ముకుమ్మడిగా నినదించారు. తుక్కుగూడ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ స్కీమ్‌లపై బుధవారం ఇబ్రహీంపట్నంలో సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్ పర్సన్లు స్రవంతి, హర్షిక, అనూరాధ, అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీపీ రేఖ, కౌన్సిలర్లు మంగమ్మ, మమత, పార్టీ మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు మల్లిక మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబంలోని మహిళకు నెలకు రూ. 2,500ల నగదు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం తదితర పథకాలను అమలు పరుస్తామని సోనియా గాంధీ ప్రకటించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. మహిళా కాంగ్రెస్ నేతలు హరిత, జ్యోతి, మాధవి, శిల్ప, రత్నకుమారి, సంతోష, ఉమా, లక్ష్మి, భాను, ఐలమ్మ, యాదమ్మ, సుకన్య, అండాలు, అమృత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారానికి ఏర్పాట్లు

- దసరా కానుకగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అల్పాహారం
- రవ్వ, ఉప్మా, కిచిడి, పొంగలితో మెనూ!
- జిల్లాలో 91వేల మంది విద్యార్థులకు లబ్ధి



ప్రభుత్వ బడిలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే ఉదయం రాగిజావా, సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించేందుకు సిద్ధమైంది. దసరా కానుకగా 1 నుండి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఇక నుంచి అల్పాహారం అందించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించి జీఓ సైతం వెలువడటంతో జిల్లా విద్యాధికారులు అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పథకం నిరుపేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దసరా నుంచి ప్రారంభం..

తమిళనాడులో ఈ పథకం సక్సెస్ కావడంతో మన రాష్ట్రంలో కూడా అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 24 నుంచి అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. వికారాబాద్ జిల్లాలోని 1054 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 91వేల మంది విద్యార్థులకు ఈ పథకంతో మేలు జరుగనుంది. ఇప్పటికే బెల్లంతో కూడిన రాగిజావ, ఉడికించిన కోడిగుడ్లు అందిస్తున్నారు. వీటిని అలాగే కొనసాగిస్తూ అల్పాహారం పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రవ్వ, ఉప్మా, కిచిడి, పొంగలితో మెనూ..

దసరా నుండి ఇచ్చే అల్పాహారం పథకంలో రవ్వ ఉప్మా, కిచిడి, పొంగలి, కేసరి వంటి పదార్థాలతో కూడిన మెనూ ఉంటుందని సమాచారం. ఇప్పటికే ఉదయం రాగానే విద్యార్థులకు రాగిజావ ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనానికి.. రాగిజావాకు మధ్యలో ఈ అల్పాహారం అందించేందుకు నిర్ణయించారు. మధ్యాహ్న భోజనాన్ని ఒకగంట ఆలస్యంగా అంటే 2 గంటలకు ఇస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా చేస్తున్నారు.

హాజరుశాతం పెరిగే అవకాశం

ప్రభుత్వం ప్రకటించిన అల్పాహారం పథకం పేద విద్యార్థులకు ఎంతో మేలు చేయనుంది. ఇప్పటికే రాగి జావ, వెజిటేబుల్ బిర్యానీ వంటివి ఇస్తుండటంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అల్పాహారం ఇస్తే వారిలో రక్తహీనత వంటి సమస్యలు పోవడంతో పాటు, హాజరు శాతం పెరిగే అవకాశం కూడా ఉంది. ఈ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి, వికారాబాద్

క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆనంద్



అనంతగిరి: వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలపై చర్చించారు.

మట్కా ఆడుతున్న 14 మందిపై కేసు



పోలీసుల అదుపులో నిందితులు

తాండూరు: మట్కా ఆడుతున్న 14 మందిపై కేసు నమోదు చేసినట్లు తాండూరు పట్టణ ఎస్సై అబ్దుల్ రవూఫ్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సీతారాంపేట్ ప్రాంతంలో కొందరు వ్యక్తులు మట్కా ఆడుతున్నారన్న పక్కా సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందడంతో టాస్క్‌ఫోర్స్ బృందం శిబిరంపై దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.14,200 నగదును, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా విద్యార్థిని మృతి



నందిని(ఫైల్)

పరిగి: అనుమానాస్పదస్థితిలో ఓ విద్యార్థిని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జాఫర్‌పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కావలి శ్రీనివాస్, అమృత దంపతుల కూరుతు నందిని(15) పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. బుధవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఇంట్లో ఫ్యానుకు ఉరేవేసుకొని నందిని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే, నందిని తాత అనంతయ్య మృతురాలి తల్లి అమృతపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగమ పరీక్షలో మండల వాసి సత్తా



ప్రశంసా పత్రం అందుకుంటున్న మణికంఠ

కుల్కచర్ల: దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహించిన ఆగమ పరీక్షలో కుల్కచర్ల మండల వాసి మడపతి మణికంఠ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో బుధవారం ఆయనకు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ.. ఆగమ పరీక్షలో ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రం పొందడం సంతోషంగా ఉందన్నారు.

డ్రగ్స్ రవాణాదారుల అరెస్ట్

పహాడీషరీఫ్: అంతరాష్ట్ర డ్రగ్ రవాణా చేస్తున్న ముఠాను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్రకు చెందిన ఇద్దరు డ్రగ్ సరఫరాదారులు హైదర్ ఎక్బాల్ సిద్దిక్ మక్వా(35), ముస్తాక్ షేక్(35), పహాడీషరీఫ్‌కు చెందిన డ్రగ్ పెడ్లర్ సయ్యద్ జావెద్(50) డ్రగ్స్ సరఫరా చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం అందుకున్న టీఎస్ నాబ్ అధికారులు, పహాడీషరీఫ్ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7 లక్షల విలువైన 1030 గ్రాముల చరాస్, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు

- శానిటేషన్ – ప్లాంటేషన్ సక్రమంగా ఉండాలి
- ప్రతి వారం గ్రామాలకు వస్తా
- డీపీఓ తరుణ్ హెచ్చరిక



పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీపీఓ తరుణ్

పెద్దేముల్: గ్రామాల్లో శానిటేషన్.. రోడ్ల పక్కన ఎవెన్యూ ప్లాంటేషన్ సక్రమంగా ఉండాలి, నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని డీపీఓ తరుణ్ అధికారులను హెచ్చరించారు. బుధవారం పెద్దేముల్ మండల నాగులపల్లి, గోపాల్‌పూర్, ఇందూరు, తట్టెపల్లి గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ సక్రమంగా లేదని. పల్లెలో శానిటేషన్ పేరుక పోయిందన్నారు. మండల అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేదని, ఇక నుంచి గ్రామాల్లో పర్యవేక్షణ సక్రమంగా ఉండాలని మండిపడ్డారు. తీరు మారక పోతే వేటు తప్పదని హెచ్చరించారు. తాండూరు–హైదరాబాద్, తాండూరు– జహీరాబాద్, తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారుల పక్కన నాటుతున్న మొక్కలు కనీసం రెండున్నర నుంచి మూడు మీటర్లు తప్పకుండా ఉండాలన్నారు. మొక్కలు సంరక్షణతో పాటు ప్రతినిత్యం నీరు పోసేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకో వాలన్నారు. నాటిన మొక్కలు ఎండిపోయిన ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులపై రికవరీతో పాటు వేటు తప్పదన్నారు. అలాగే, శానిటేషన్ కూడా పలు గ్రామాల్లో సక్రమంగా లేదని, వారం రోజుల్లో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పెద్దేముల్ మండల తట్టెపల్లిలో వారం రోజుల నుంచి జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమ దృష్టికి రావడంతో డీపీఓ తరుణ్, డీఎల్‌పిఓ శంకర్‌నాయక్, ఎంపీడీఓ లక్ష్మప్పలు తట్టెపల్లి గ్రామానికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. మైనార్టీ వార్డుల్లో మురుగు నీరు నిల్వడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, వెంటనే వాటిని శుభ్రం చేయాలని ఎంపీడీఓ లక్ష్మప్పను ఆదేశించారు. తట్టెపల్లిలో ఎలాంటి ఘటన జరిగిన బాధ్యులుగా ఉండాల్సి వస్తుందని, ఎవరు నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. వారంలో ఒక రోజు మండలంలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా, శానిటేషన్‌లో నిర్లక్ష్యం చేసినా సహించమని తెలిపారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ల్లో తడి– పొడి చెత్త వేరు వేరుగా ఉండేలా ట్రాక్టర్‌లను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ లక్ష్మీదేవి. ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

తాండూరు రూరల్: పల్లెల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దని డీపీఓ తరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గౌతపూర్, చెంగోల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలు మలేరియా, డెంగీ వంటి విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్ రెడ్డి, ఎంపీఓ రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి

బంట్వారం: వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం బంట్వారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామని తెలిపారు. తీసుకున్న రుణాలను రైతులు వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లిస్తే వడ్డీ తక్కువగా ఉంటుందన్నారు. రికవరీ 50 శాతం కంటే ఎక్కువగా ఉంటేనే నాబార్డు లాంటి సంస్థలు మరింత అప్పు ఇస్తాయన్నారు. సంఘం అభివృద్ధికి రైతులందరూ సహకరించాలని ఆయన సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు ఎరువులు అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. త్వరలోనే ఎరువుల గోడౌన్ నిర్మాణం చేపడుతామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలం సేకరణ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. సొసైటీలో తక్కువ వడ్డీకే బంగారం తాకట్టుపై రుణ సదుపాయం ఉందని చెప్పారు. ఆసక్తి గల వారు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం సీఈఓ బ్రహ్మం జమ ఖర్చుల లెక్కలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్ సొసైటీ డైరెక్టర్లు ,సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళను ప్రోత్సహించాలి



చేనేత హస్తకళను ప్రారంభిస్తున్న మంజుల తదితరులు

వికారాబాద్ అర్బన్: చేనేత హస్తకళను ప్రోత్సహించాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని క్లబ్ ఫంక్షన్ హాల్లో చేనేత వస్త్ర కళ ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేయూతనిస్తూ చేనేత హస్తకళను ముందుకు నడిపిస్తుందని తెలిపారు. ప్రజలు కూడా చేనేత వస్త్రాలను ధరిస్తూ కార్మికులను ప్రోత్సహించాలని ఆమె కోరారు.

సీతాఫలాల కోసం వెళ్లి..

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



గోవింద్‌నాయక్ మృతదేహం

మర్పల్లి: సీతాఫలాల కోసం వెళ్లిన ఓ వ్యక్తి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన మండల పరిధిలోని సిరిపురం వ్యవసాయ పొలాల్లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని శివ్వన్న గూడెంకు చెందిన గోవింద్‌నాయక్ (32) బుధవారం అదే గ్రామానికి చెందిన శారద అనే మహిళను ఉ. 6 గంటలకు తన బైక్‌పై ఎక్కించుకుని సీతాఫలాల కాయల కోసం మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి వచ్చాడు. సిరిపురం వ్యవసాయ పొలాల వద్ద సీతాఫలాలు తెంపుతుండగా నేలపై తెగిపడ్డ విద్యుత్ తీగను తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాయలు తెంపేందుకు వెళ్లిన గోవింద్‌నాయక్ కనిపించక పోవడంతో బైక్‌పై వచ్చిన మహిళ శారద ఇంటికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. దీంతో మృతుడి భార్య గీత, ఆమె మేనల్లుడు ఘటనా స్థలం చేరుకొని చుట్టు పక్కల వెతికారు. సిరిపురం కొయ్యగుట్ట ప్రాంతంలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపాడు.

నిమజ్జనానికి కోట్‌పల్లి ప్రాజెక్టు ఎంపిక



అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

ధారూరు: మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టును ఈ సంవత్సరం కొత్తగా వినాయకుల నిమజ్జనానికి అధికారులు ఎంపిక చేశారు. బుధవారం ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సంతోష్‌కుమార్, తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీఓ షఫీఉల్లాతో పాటు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, విద్యుత్, ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టును పరిశీలించారు. నీటి లోతు ఎక్కడ తక్కువగా ఉందో పరిశీలించి అక్కడ వినాయకులను నిమజ్జనం చేయడానికి నిర్ణయించారు. ఇక్కడే లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయడానికి అంగీకరించారు. శుక్రవారం నుంచి ప్రారంభమైయ్యే వినాయకుల నిమజ్జనంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు. నిమజ్జనం సమయంలో వినాయకులను ఈత వచ్చిన వారే నీటిలోకి తీసుకెళ్లి నిమజ్జనం చేయాల్సి ఉంటుందని అధికారులు నిబంధన విధించారు. ప్రాజెక్టు ప్రాంతంలో నిమజ్జన ఏర్పాట్లను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

గాయపడిన వ్యక్తి ..

చికిత్స పొందుతూ మృతి



మృతి చెందిన రహీమాన్ (ఫైల్)

మర్పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన పట్లూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మర్పల్లి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్లూర్ గ్రామానికి చెందిన అబ్దుల్ రహీమాన్ (50) డ్రైవర్, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన సంతలో కూరగాయలు కొని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో మండల పరిధిలోని నర్సాపూర్ తండాకు చెందిన ఓ మైనర్ బాలుడు (7వ తరగతి) ద్విచక్రవాహనంపై పట్లూర్ నుంచి నర్సాపూర్ వెళ్తూ అబ్దుల్ రహీమాన్ బైక్‌ను ఢీ కొట్టాడు. దీంతో అబ్దుల్ రహీమాన్ కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. రహిమాన్ కిందపడడంతో పట్లూర్ గ్రామానికి చెందిన మరో వ్యక్తి తన వాహనం అదుపుకాక అబ్దుల్ రహీమాన్‌పై నుంచి దూసుకుపోయాడు. దీంతో మరిన్ని గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అబ్దుల్ రహీమాన్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి మంజీర ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన డాక్టర్లు నగరంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మల్లారెడ్డి ఆస్పత్రిలో రెండు రోజులు చికిత్సలు పొందిన అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీంతో గాంధీలో చిక్సిత పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమర్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి చెప్పారు. కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు.

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హఫీజ్

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డిని బుధవారం మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎం.డి హఫీజ్, మాజీ కౌన్సిలర్ నర్సింలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా అభివృద్ధికి, పార్టీ సంస్థాగత నిర్మాణానికి సీనియర్ నాయకులంతా కృషి చేయాలని మంత్రి సూచించారు.

ఆశ కార్యకర్తల సమ్మె నోటీసు



తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశలు

కుల్కచర్ల: తాము ప్రజల సంక్షేమానికి నిర్వీరామంగా విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆశ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీధర్‌కు నిరవధిక సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమతో అవిశ్రాంతంగా పనులు చేయించుకుంటూ సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. కనీస వేతనం రూ.18వేల ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ విషయం మర్చిపోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘ నాయకులు పుష్ప, పద్మ, స్వరూప, సునిత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

వ్యక్తి మృతి

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామశివారులో బుధవారం చోటు చేసుకుంది. సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ పట్టణం, అప్పనపల్లికి చెందిన కుమ్మరి రాఘవులు(35) హైదరాబాద్ పట్టణ సమీపంలోని శివరాంపల్లి పరిసరాల్లో తాపిమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి శివరాంపల్లి నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్ శివారులో వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాఘవులు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ కాంతారావు

ఐసీడీఎస్–సీడీపీఓ కాంతారావు

బంట్వారం: మహిళలు, కిషోర బాలికలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ కాంతారావు అన్నారు. బుధవారం కోట్‌పల్లిలో నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో ఆయన మాట్లాడారు. చాలా మంది మహిళలు ,కిషోర బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. సరియైన పోషకాహారం తీసుకోకపోవడంతో బలహీనతతో పాటు, తరచుగా ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆయన వివరించారు. నిత్యం భోజనంలో ఆకుకూరలు ,కూరగాయలు ,పప్పు దినుసులు ఉండాలని ఆయన సూచించారు. గుడ్లు ,బెల్లం ,రాగులు ,కొర్రలు ఆహారంలో తప్పనిసరిగా వాడాలన్నారు. గర్భిణిలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచన మేరకే మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి , కోట్‌పల్లి సర్పంచ్ విజయలక్ష్మి ,హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్‌రెడ్డి ,అంగన్‌వాడీ టీచర్లు , కిషోర బాలికలు ,గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర అల్పసంఖ్యాక వర్గ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే పేద మైనార్టీ విద్యార్థులకు సీఎం విదేశీ విద్యా పథకం స్ప్రింగ్ సీజన్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా పేద మైనార్టీ విద్యార్థులకు రూ. 20 లక్షలు ఉపకార వేతనంతో పాటు, విమాన రవాణా ఖర్చుల కింద రూ.60,000 మంజూరు చేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ, ఇంజనీరింగ్‌లో 60 శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయుటకు, పీహెచ్‌డీ చేయాలనుకునేవారు పీజీలో 60 శాతం మార్కులు పొందిన వారు అర్హులని తెలిపారు. జనవరి 2023 నుంచి జులై 2023 మధ్యకాలంలో విదేశీ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన మైనార్టీ విద్యార్థులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. సంబంధిత ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు. చివరి తేదీ ఈనెల 25 వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. సా. 5 గంటల వరకు దరఖాస్తు చేసుకొని హార్డ్ కాపీలను జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించాలని ఆమె తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల

దౌల్తాబాద్: చిరుధాన్యాలను తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల, సర్పంచు బసమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోకఫస్లాబాద్, బాలంపేట గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన పోషణ్ అభియాన్ మాసంలో గర్భిణిలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పౌష్టికాహరంపై శ్రద్ధ తీసుకోవాలని, ప్రభుత్వం సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బాలమణి, శ్రీదేవి, హెల్పర్లు భీమమ్మ, నారందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత మల్లేశ్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిగి: ధరణి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పరిగి డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి సీపీఐఎంఎల్ నాయకులు ధరణి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ధరణి వచ్చినప్పటి నుంచి రైతులకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఎంతో మందికి కొత్త పాసుపుస్తకాలు రాకా ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. పాసుపుస్తకాల కోసం చెప్పులు అరిగేలా తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగి పనులు కావడం లేదని తెలిపారు. కొత్త పాసు పుస్తకాలు రాకా రైతుబంధు, రైతు బీమా క్రయవిక్రయాలు జరగకా రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని వాపోయారు. చిన్న చిన్న సమస్యలు ఉన్న వారికి పట్టా పాసుపుస్తకాలు రాలేవని చెబుతున్నారని అన్నారు. ఆర్ఎస్ఆర్ పేరిట చాలా సర్వే నంబర్లను ఎక్కించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని వివరించారు. కావునా, వెంటనే ధరణి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బసిరెడ్డి, పోచయ్య, మహేందర్, బుగ్గయ్య పాల్గొన్నారు.

అనుమతులు ఇప్పించండి



మంత్రిని కలిసిన హెచ్ఎండబ్ల్యూస్ అధికారులు, నాయకులు

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సురక్షితమైన మంచి నీరు అందించడానికి నూతన పైపులైన్‌ను వేయనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం జాతీయ రహదారి వెంబడి త్రవ్వకాలు చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారుల నుంచి అనుమతులు ఇప్పించాలని కోరుతూ హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ త్వరలో ఆర్అండ్‌బీ అధికారులతో అనుమతులు వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, కౌన్సిలర్ రవినాయక్, నాయకులు సప్పిడిరాజు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి..

సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామాలు, తండాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని మేడిగడ్డతండాలో బుధవారం రాఘవేందర్‌రెడ్డి పర్యటించి గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గతంలో మేడిగడ్డతండాలో పర్యటించిన సమయంలో వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షలు విరాళం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మొదటి విడతగా గతంలో రూ.1.50 లక్షలు ఇవ్వగా బుధవారం మరో రూ.1.50 లక్షలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాదికాలంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి ప్రవేశించానని ప్రజలు ఆశీర్వదిస్తే మరింత సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, స్థానిక నాయకులు తావుర్య, చంద్రియ, లోక్యానాయక్, చంద్రునాయక్, పత్యానాయక్, కుమార, భవన్, సుభాష్, ప్రభాస్, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.